


# సంస్కృతి

—బుద్ధి యజ్ఞమూర్తి

మేకప్ సరిగా వుందో లేదో మరోసారి పరీక్షగా చూసుకుంది జ్యోత్స్న అద్దంలో. వెనుక నుంచి రెండు చేతులు వచ్చి పడ్డాయి ఆమె భుజాల మీద. చప్పున తలతిప్పింది.

''ఎంతందంగా ఉన్నావో తెలుసా?'' అంటూ ఆమె ముఖాన్ని పైకెత్తాడు, ముద్దు పెట్టుకునే ఉద్దేశంతోటి - రవి.

''వదులు. సమయం, సందర్భంగా వుండదు నీకు. ఇప్పుడే తయారయ్యాను. మేకప్ పాడవుతుంది''

ఆమెపై వేసిన చేతులు వెనక్కి లాక్కున్నాడు. హృదయంలో కలుక్కుమంది. మళ్ళీ అంది జ్యోత్స్న.

''నీవేమిటి ఈ డ్రస్‌తోనే వొచ్చేస్తావా? సూట్ వేసుకో. మొదటిసారి నీ బాస్ ఇంటికి కలిసి వెళ్తున్నాం. వాళ్ళ స్థాయికి తగ్గట్లు డ్రస్ వేసుకోవాలనే సెన్స్ కూడా లేకపోతే ఎలా?''

'ఆపు' అని అరవాలనుకున్నాడు. అరవలేకపోయాడు. ఏమీ అనలేకపోయాడు. పెళ్ళయిన క్షణం నుంచే జ్యోత్స్నని గట్టిగా ప్రేమిస్తూ వస్తున్నాడు. తన ప్రేమని గ్రహిస్తున్నట్లే ఉంటుంది కానీ రోజులు ఏదో ఓ క్షణంలో తనని కష్టపెట్టే విధంగా ప్రవర్తిస్తుంది, మాట్లాడుతుంది. అట్లా మాట్లాడితే తన మనసు బాధపడుతుందని చెప్పాడు - ఒక్కసారి కాదు ఎన్నోసార్లు. తిరిగి తన మాట తనకే వొప్పజెబుతుంది. తనెక్కడ పొరపాటు చేశాడు? జ్యోత్స్నని పెళ్ళి చేసుకోడమే తన పొరపాటా? ఛ... ఛ... తనకిప్పుడు ఇట్లాంటి యోచన రావడమేంటి?

చిన్నప్పట్నించీ తనుపడ్డ కష్టాలు తనకి జీవితం పట్ల ప్రేమని పెంచేట్లు చేశాయే కానీ వైరాగ్యాన్ని కల్గించలేదు. ఒక్కసారి తన ఊరు జ్ఞాపకమొచ్చింది. వ్యవసాయం, నీటిపారుదల రంగాల్లో రోజురోజుకీ ఆధునికీకరణ చోటు చేసుకుంటుంటే తన ఊళ్ళో బుంగపోత సేద్యం ఇంకా సాగుతూనే వస్తోంది. తన తండ్రి బుంగపోత సేద్యగాడు. పరిశీలించి చూస్తే ఆ సేద్యంలో స్వేదం చిమ్మటమే కానీ, శ్రమకి తగిన ప్రతిఫలం సేద్యగాళ్ళకి అందదనే తెలుస్తుంది.

అర ఎకరం స్థలంలో తన తండ్రి ఓ పక్క కూరగాయల్నీ, ఇంకోపక్క పూలనీ సాగుచేసేవాడు. చేను మధ్యలో దొరువు. ఆ దొరువులో దిగి బుంగలతో నీళ్ళు తెచ్చి తండ్రి మొక్కలకి నీళ్ళు పోస్తుంటే తనూ దొరువులోకి దిగుతానని మొండికేసేవాడు. ముందు బుజ్జగించి అప్పటికీ వినకపోతే పిర్రమీద ఒక్కటి వేసి తనని మొక్కల మధ్యనే కూర్చోబెట్టేవాడు. కొంచెం పెద్దయి హైస్కూల్లో చేరినాక ఉదయం స్కూలుకి వెళ్ళేలోగా తానూ బుంగలతో దొరువులోకి దిగి నీళ్ళు నింపి మొక్కలకి పోసేవాడు. ముందు వొద్దని చెప్పినా తన పట్టుదల చూసి మిన్నకుండేవాడు తండ్రి. ఐదు వరకి ఆశ్రమ పాఠశాలల్లో చదవడం వల్ల ఖర్చేమీ లేకుండానే ఐదేళ్ళు గడిచాయి. హైస్కూల్లో చేరాక పుస్తకాలకి కాకపోయినా యూనిఫారాల కనీ, ఇతరత్రా డబ్బులు అవసరమవుతున్నాయి. ఇంట్లో ఎప్పుడూ డబ్బుకి కటకటగానే ఉండేది. నైమట్టికి (పశువుల ఎరువు) పెద్ద ఖర్చు కాదు కానీ, రసాయనిక ఎరువులకి మాత్రం డబ్బెక్కువ అయ్యేది. వాటికోసం ఒక్కోసారి అప్పుచేసేవాడు తండ్రి.

కాపుకొచ్చిన పూలు ఆ పూటకి అమ్ముడు పోకపోతే వాడిపోయి ఎందుకూ పనికిరాకుండా పోయేవి. తన తల్లి విడిగానూ, మాలలుగానూ కట్టి ఇంటింటికీ తిరిగి పూలు అమ్మేది. అమ్ముడు పోకుండా మిగిలిన పూలని పారేస్తున్నప్పుడు అమ్మ బాధ చూస్తే కడుపు దేవేసేది. తన పిల్లల్ని పారేస్తున్నట్లే అమ్మ విలవిల్లాడేది. గిట్టుబాటు కాక ఎప్పుడన్నా కాస్త ఎక్కువ ధర చెబితే పూలు కొనేవాళ్ళు నానా మాటలూ అనేవాళ్ళు. తమ కష్టంతో, తమ చెమటతో పండించిన పూలని సౌఖ్యంగా తలలకి తురుముకుని సింగారించుకుంటూనే హృదయానికి బాధ కలిగేట్లు మాట్లాడతారెందుకో ఆ స్త్రీలు తనకి అర్థం కాదు. ఆ కష్టంలోనే తను పెరిగాడు. తానూ కష్టపడ్డాడు. అట్లానే తనని చదివించాడు తండ్రి. చెల్లి, తమ్ముడికి మాత్రం చదువుల్లేవు! టెన్త్‌లోనూ, ఇంటర్మీడియెట్‌లోనూ ఫస్ట్‌క్లాసులో తాను పాసయితే ఫస్ట్‌ర్యాంకు వచ్చినంత సంబరంగా తల్లీ, తండ్రి చుట్టుపక్కల వాళ్ళకి గర్వంగా చెప్పుకున్నారు. 'మావాడు ఫస్టులో పాసయ్యాడ'ని.

డిగ్రీ పూర్తి చేశాక ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఐఆర్‌పిఎం) లో ఆంధ్రా యూనివర్శిటీలో సీటు వచ్చింది, పోస్టుగ్రాడ్యుయేషన్‌కై. చార్జీలకి కూడా డబ్బులేని పరిస్థితిలో తండ్రికి అప్పు వెంటనే పుట్టలేదు. అప్పుడు తన తండ్రి కళ్లలో నీళ్ళని తొలిసారిగా చూశాడు. తను ఏమీ చేతకాని నిస్సహాయుణ్ణయినాయనే దిగులుతో వచ్చినవవి. అప్పటికప్పుడు అమ్మ తన చెవికమ్మలు తీసి తాకట్టు పెట్టిన డబ్బుతో తను విశాఖపట్నం వెళ్ళాడు. హాస్టల్లో వుండి వచ్చే స్కాలర్‌షిప్‌తోనే రెండేళ్ళూ చదివాడు. మాస్టర్స్ డిగ్రీ సర్టిఫికెట్ తీసుకుంటున్నప్పుడు తనకి సంతోషంతో కళ్ళు చెమ్మగిల్లాయి.

హైద్రాబాద్‌లో సెక్రటేరియట్‌లోనే తనకి ఉద్యోగం వచ్చింది. వెంటనే తనకి సంబంధాలు చూడ్డం మొదలుపెట్టాడు తండ్రి. అప్పటికే చెల్లి పెళ్ళయ్యింది. హైద్రాబాద్‌లోనే వుండే వరసకి మేనమామ అయ్యే ఆయన కూతురు జ్యోత్స్నతో తనకి జీవితాన్ని ముడిపెట్టారు. తనూ ఆమె అందం చూసి సంబరపడ్డాడు. పై అందంకాక, లోపలి అందం కూడా ఒకటుంటుందనే సంగతి పెళ్ళి చూపుల్లో జ్యోత్స్నని చూసినప్పుడు తనకి జ్ఞాపకం రాలేదు.

జ్యోత్స్న కోసం ఏడువందల రూపాయల అద్దె ఇంట్లోంచి రెండువేల రూపాయలు ఇచ్చే ఇంట్లోకి మారాడు. ఆమెకి అణువణువునా ఒంటపట్టింది సిటీకల్చర్. పెళ్ళయిన కొద్దిరోజులకే బేగంపేటలో పేరు పొందిన పెద్ద ప్రైవేటు కంపెనీలో పర్సనల్ ఆఫీసర్‌గా తనకి ఆఫర్ వచ్చింది. పొరపాట్న చెప్పేశాడు జ్యోత్స్నకి ఈ సంగతి. తనకి ఇప్పుడొస్తున్న జీతం కంటే మూడువేల రూపాయలు ఎక్కువిస్తామంటున్నారని కూడా చెప్పేశాడు. సెక్రటేరియట్‌లో సెక్యూరిటీ వున్న జాబ్‌కి రిజైన్ చేసి ఆ కంపెనీలో చేరేదాక వదల్లేదు జ్యోత్స్న. ఇప్పుడు ఇంట్లో డబుల్‌కాట్, కలర్ టీవీ, ఐరన్ బీరువా, ఎయిర్‌కూలర్, వాషింగ్‌మెషీన్, సోఫాలు, పేము కుర్చీలు, షోకేస్ మెటీరియల్ - ఇవన్నీ ఉన్నాయి. ఏదీ తాను మనసుపెట్టి కొనలేదు, ఆమె కోసం, ఆమె ఆనందం కోసమే కొన్నాడు. పెళ్ళికాక ముందు సగం జీతం ఇంటికి పంపేవాడు. ఇవాళ తానే జ్యోత్స్నని అడిగి తీసుకోవాల్సి వస్తున్నది, పాకెట్ మనీకై.

అమ్మకి ఆరోగ్యం సరిగా లేదని, డబ్బు అవసరం ఉందని తమ్ముడు కబురు చేసినా తను డబ్బు పంపలేకపోయాడు. దుఃఖం వస్తుంది తన దౌర్భాగ్యం తల్చుకుంటే. ఏడవడం తనకి ఇష్టం వుండేది కాదు, ఇంతకుముందు తనకి అసహ్యమన్పించేది వయసు వచ్చినవాళ్ళు ఏడుస్తుంటే. తనకే అట్లాంటి స్థితి వచ్చినప్పుడు కానీ తెలిసిరాలేదు, జనం ఎందుకు, ఎట్లాంటి స్థితుల్లో ఏడుస్తుంటారో.

తమకంటే పై స్థాయిలో వున్న హైక్లాస్ స్త్రీలని అనుకరించాలని, వారి స్థాయికి అప్పటికప్పుడు చేరుకోవాలని తాపత్రయపడుతుంది జ్యోత్స్న. వాస్తవానికి దూరంగా యోచిస్తుంది. ఎదుటివాళ్ళ దృష్టంతా తన మీదే ఉండాలని అతిగా అలంకరించుకుంటుంది. మార్కెట్లో కొత్త కాస్మెటిక్ వస్తువు ఏది రిలీజయినా వెంటనే అది తమ ఇంట్లో ప్రత్యక్షమవ్వాల్సిందే. ఆధునికీకరణ, పాశ్చాత్య సంస్కృతి నగరాన్ని పాదరసంలా ఆక్రమించుకుంటున్నదనేందుకు జ్యోత్స్న నిదర్శనమనిపిస్తుంది. ఆమెకి తన స్థాయి ఏమిటో, నిరాడంబరంగానే సంతోషంగా ఎట్లా బతకవచ్చో చెప్పాలని ప్రయత్నించాడు. అవేమీ ఆమెని ప్రభావితం చేయలేకపోయాయి. 'ఆమె ఇష్టాయిష్టాలు ఆమెవి' అని ఎంతగా సర్ది చెప్పుకుందామనుకుంటున్నా హృదయంలో వేదన పెరుగుతూనే ఉంది. తెలీని అసంతృప్తి ఏదో శిఖరంలా గూడుకట్టుకుంటోంది. ఎట్లాంటి జీవితాన్ని తను ఆశించాడు? ఎట్లాంటి జీవితం తనకి దక్కింది? తన హృదయం చెప్పినట్లు ఏమీ చేయలేక పోతున్నాడెందుకని? తను... తను... అసమర్థుడా?

''ఏంటి? ఏదో లోకంలోకి వెళ్ళిపోయినట్లున్నావ్. ఈ మధ్య నేనేం చెప్పినా వేరే లోకాలకి వెళ్ళిపోతున్నావ్'' అని జ్యోత్స్న భుజం పట్టుకు వూపటంతో ఆలోచనలు తెగిపోయాయి.

''ఏడుగంటలకల్లా వెళ్ళాలని నువ్వే చెప్పావ్. నేను రెడీ. నీదే లేట్. సూట్ వేసుకు రమ్మంటే నిల్చునే సెటిల్ అయిపోయావ్''

సూట్ అంటే తనకి చిరాకు. అది వేసుకుంటే బరువైన పదార్థంతో శరీరాన్ని బంధించినట్లన్పిస్తుంది. వళ్ళంతా ముళ్ళతో గుచ్చుతున్నట్లన్పిస్తుంది. తనకిష్టం లేదంటున్నా పట్టుపట్టి నాలుగువేల రూపాయలు ఖర్చుపెట్టి సూట్ తీసుకుంది. వేసుకోనంటే ఎంత రాద్ధాంతమైనా చేస్తుంది. మౌనంగా సూట్ వేసుకు వచ్చాడు. చూసి లోపలి షర్టుకు పెట్టిన 'టై' సరిచేసి ''వెరీగుడ్'' అంది.

గేటు వద్దనే స్వాగతం లభించింది. జ్యోత్స్నని మధుసూదన్ దంపతులకి పరిచయం చేశాడు రవి. చేతులెత్తి నమస్కారం చేయబోతున్న జ్యోత్స్న చేయిని మధ్యలోనే ఆపి షేక్‌హ్యాండ్ తీసుకున్నాడు మధుసూదన్. తల వాల్చుకుని ఓరకంట జ్యోత్స్న వంక చూశాడు. బాధ పడిందేమోనని. జ్యోత్స్న చిన్నగా నవ్వుతోంది.

రెండంతస్తుల ఆ ఇంట్లోకి అడుగుపెట్టి ఆశ్చర్యంతో చూస్తుండిపోయింది జ్యోత్స్న. మధుసూదన్ భార్య ''రండి ఇల్లు చూద్దురుగాని'' అని లోపలికి వెళ్తుంటే అనుసరించింది. ఆమె - నళిని - చాలా ఆకర్షణీయంగా ఉంది. జుత్తు భుజాల వద్ద కత్తిరించుకుంది. స్లీవ్‌లెస్ వేసుకుంది. రెపరెపలాడుతున్న ముదురు ఆకుపచ్చ చీర కట్టుకుంది. ఆమె నడుస్తుంటే వెనుక షేపులు తెలుస్తున్నాయి. ఆ బిల్డింగ్ అప్పుడే కట్టించినంత అందంగా, కొత్తగా అవుపిస్తోంది. ఖచ్చితమైన ప్లాన్‌తో, మ్యాచింగ్ కలర్స్‌తో - ఒక్కో గదీ చూస్తుంటే కళ్ళు చెదురుతున్నాయి జ్యోత్స్నకి.

బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్ళింది నళిని. అన్ని గదులూ ఒక ఎత్తు ఐతే బెడ్‌రూమ్ ఒక్కటీ ఒకెత్తుగా తోచింది జ్యోత్స్నకి. డోర్‌కీ, విండోలకీ ముదురు వెల్వెట్ రంగు కర్టెన్లు వేలాడుతున్నాయి. బ్రౌన్‌కలర్ వాల్ టు వాల్ కార్పెట్, బ్రౌన్‌కలర్ బెడ్ కవరింగ్స్, బెడ్‌కి తలవైపున గోడమీద అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్ - అందులోనూ ఉపయోగించింది బ్రౌన్ కలరే. జ్యోత్స్నకి వేరే లోకంలోకి వచ్చినట్లుంది. కింద కార్పెట్ మీద అడుగేయటానికే సంకోచం కల్గింది చూసి ''అరె ఎందుకట్లా ఫీల్ అవుతారు. రండి'' అని నళిని జ్యోత్స్న చేయి పట్టుకు తీసుకుపోయి బెడ్‌మీద కూర్చోబెట్టింది.

''ఎలా ఉంది? ఇదంతా నా టేస్టే'' అంది నళిని నవ్వుతూ.

''ఫెంటాస్టిక్'' అంది జ్యోత్స్న ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ.

లేచి పక్కనే వున్న స్లైడింగ్ డోర్ తెరిచింది నళిని. వార్డ్‌రోబ్‌లో హాంగర్స్‌తో తగిలించిన చీరలు... చిన్నపాటి శారీ సెంటర్‌కి వచ్చినట్లుగా ఫీలయ్యింది జ్యోత్స్న. అందులో ఓ చీర బాగా ఆకర్షించింది ఆమెని. లేత పసుపుపచ్చ షిఫాన్ చీరపైన బ్లాక్ కలర్ ఫ్లవర్స్ ప్రింట్ చేసి ఉన్నాయి. ఆ చీర పట్టుకుని అట్లానే నిల్చుండిపోయింది.

జ్యోత్స్న వంక చూసి చిన్నగా నవ్వుకుని ''ఇది మీకు నచ్చిందా. పోయిన మ్యారేజ్‌డేకి మధు ప్రెజెంట్ చేశారు'' చెప్పింది నళిని.

''మంచి టేస్ట్ మీదీ, మీ వారిదీ'' అభినందించింది.

''మన మగవాళ్ళకి చిన్న సర్‌ప్రైజ్ ఇద్దాం''

''ఏమిటి?''

''ఇప్పుడు మీరు ఈ శారీ కట్టుకోబోతున్నారు''

''నేనా?''

''యస్. మీరే''

కింద మగవాళ్ళిద్దరూ కంపెనీ తాలూకు వ్యవహారాలు మాట్లాడుకుంటున్నారు. ఇంతకీ మధుసూదన్ ఎవరో చెప్పనే లేదు. రవి పనిచేస్తున్న కంపెనీ జనరల్ మేనేజర్. అప్పుడప్పుడు తన కింద ఉద్యోగులకి అట్లా పార్టీలు ఇస్తుంటాడు. అట్లా చేయడంవల్ల వాళ్ళలో తనపట్ల వున్న ఫియర్ పోతుందని, ఏదైనా సమస్య వస్తే తనకి వెంటనే చెప్పడంలో అది తోడ్పడుతుందనీ అతడి ఉద్దేశం. రవి అతడి గురించి వేరే రకంగా కూడా విని ఉన్నాడు. మధుసూదన్ ఫారిన్ రిటర్న్‌డ్. పాశ్చాత్య సంస్కృతి పట్ల అతడికి మోజెక్కువ అనీ, పరాయి ఆడవాళ్ళంటే మరీ మోజెక్కువ అనీ విన్నాడు. అతడి ఇల్లు చూశాక అది నిజమేనన్పించింది.

ఇద్దరూ లివింగ్ రూమ్ వద్దకి వచ్చారు. ఆడవాళ్ళ అలికిడే లేదు. మొత్తం రూములన్నీ కలియజూసి ''బెడ్‌రూమ్ వద్ద సౌండ్ వస్తోంది. అక్కడ వున్నట్లుంది'' అన్నాడు మధుసూదన్. ఇద్దరూ అటు కదలబోయేంతలోనే బెడ్‌రూమ్‌లోంచి ముందు నళినీ, ఆ వెనుకే జ్యోత్స్న... కళ్ళు విప్పార్చుకుని చూశాడు రవి.

జ్యోత్స్నేనా?! సౌందర్యమంతా రాశిపోసినట్లు... మధుసూదన్ అయితే 'వ్వావ్' అని వెంటనే ''వాట్ ఎ బ్యూటిఫుల్ లేడీ'' అన్నాడు. అప్పటికి తెల్లరిల్లాడు రవి. చూస్తే మధుసూదన్ కళ్ళు ఎరుపుతో మెరుస్తున్నాయి. మళ్ళీ చూశాడు జ్యోత్స్న వంక. ఎందుకట్లా చేసింది జ్యోత్స్న? నళినిగారి చీర తను కట్టుకోవటమేమిటి? అతిథులుగా వచ్చినప్పుడు అతిథులుగానే నడుచుకోవాలి. తనెటు తిరిగీ అంత ఖరీదు చీరలు కొనలేడు. దాన్ని ఎత్తి చూపుతున్నట్లే జ్యోత్స్న ప్రవర్తిస్తుందెందుకని?

''మీరు అద్భుతంగా ఉన్నారు. మా నళిని కంటె కూడా'' అన్నాడు మధుసూదన్ వాళ్ళు తమ వద్దకు రావడంతోటే.

''నేనేం ఉడుక్కోను. కరెక్టుగా చెప్పావ్'' అంది నళిని నవ్వుతూ.

మధుసూదన్ అట్లా తన అందాన్ని మెచ్చుకోవడంతో సిగ్గు పడుతూ తలవాల్చుకుంది. పెదాల మీద నవ్వు ముంచుకొచ్చింది. నవ్వు రాకపోయినా బలవంతపు నవ్వు నవ్వాడు రవి.

డైనింగ్ టేబుల్ వద్ద డిన్నర్ చేసేప్పుడు టేకువుడ్‌తో చేసి, సన్‌గ్లాస్‌తో మెరుస్తున్న టేబుల్, ఛైర్స్ వంక జ్యోత్స్న అదేపనిగా చూస్తుండటం గమనించాడు రవి. మధుసూదన్ వంక తలతిప్పకుండానే చూశాడు. జ్యోత్స్న వంకే వుంది అతడి దృష్టి. నళిని వేపు చూపు తిప్పాడు. తనవంకే చూస్తోంది నవ్వుతూ. ఆ కళ్ళు... అనీజీగా కుర్చీలో కదిలాడు. భోజనం సయించలేదు.

డిన్నర్ అవడంతోటే నళిని టేప్‌రికార్డర్ ప్లే చేసింది. స్టీరియో లోంచి ముందు మంద్రంగా మొదలైన సంగీతం స్పీడ్‌లోకి మారింది. లేడీ వాయిస్ హస్కీగా పలుకుతోంది. మధ్యలో ''హమ్మ... హమ్మ'' అంటో మూలుగులు. తట్టుకోలేక పోతున్నాడు రవి. కడుపులో తిప్పుతున్నట్లన్పిస్తోంది. తలంతా తిరిగిపోతోంది. నరాలు మెలి తిరిగిపోతున్నాయి. మంట... మంట... కడుపులో మంట... తలలో మంట... ఒళ్ళంతా మంట... రక్తం మండుతోంది. ఎవరో చేతులు పట్టుకున్నట్లు తోచి చూశాడు. నళిని! అతడి భుజాల మీద చేతులు వేసి దగ్గరకు లాక్కుంది. మండుతున్న కళ్ళతో పక్కకి చూశాడు. జ్యోత్స్న నడుం మీద మధుసూదన్ చేతులు. అతడి భుజాలపై జ్యోత్స్న చేతులు.

తను విన్నది నిజం. మధుసూదన్, నళినిలు 'వైఫ్ శ్వాపర్స్' ఢిల్లీ, బొంబాయి నగరాల్లో ఒకరి మొగుడిని మరొకరు, ఒకడి పెళ్ళాన్ని మరొకడు పరస్పరం మార్పిడి చేసుకునేవాళ్ళు ఎక్కువవుతున్నారని ఎక్కడో చదివాడు. చదివినప్పుడు ఆశ్చర్యపోయాడు. బాధపడ్డాడు. సంస్కృతి నాశనమవుతున్నదని కలవరపడ్డాడు. మహోన్నతమయిన భారతీయ సంస్కృతి... విదేశాల్లో సయితం మేధావులంతా ప్రశంసించిన సంస్కృతి ఇట్లా దిగజారిపోతున్నదెందుకని విచారపడ్డాడు. హైదరాబాద్‌లో 'రెయిన్ డ్యాన్స్'లు జరుగుతున్నాయని ఫొటోలు, వార్తలు చూశాక అతడి బాధ ఎక్కువయ్యింది. ఇప్పుడు ప్రత్యక్షంగా 'వైఫ్ శ్వాపర్స్'ని చూస్తుంటే అతడికి పిచ్చెక్కుతున్నట్లయింది. ఎట్లాంటి తను ఎట్లాగ మారిపోతున్నాడు? ఈ స్థితిలో తనని కన్నవాళ్ళు చూస్తే వాళ్ళ గుండెలు పగిలిపోతాయి. ఇట్లాంటి కొడుకుని కన్నామా మేము అని తమని తాము తగలబెట్టుకుంటారు. తల విదిలించాడు రవి. తనని చుట్టుకుంటున్న నళిని అందం ముసుగు వేసుకున్న విషసర్పంలా తోచింది. అతణ్ణి తెలీని ఉన్మత్తత ఆవహించింది. రెండు చేతుల్తో బలంగా నెట్టివేశాడు. ఊహించని చర్యకి నిలదొక్కుకోలేక వెనక్కి సోఫాలో పడిపోయింది నళిని. విసురుగా జ్యోత్స్న దగ్గరికి కదిలాడు. అప్పుడే మధుసూదన్ తన ముఖాన్ని జ్యోత్స్న ముఖం మీదికి తెస్తున్నాడు. జ్యోత్స్నని పక్కకి లాగివేసి మధుసూదన్ చెంపమీద లాగి ఒకటిచ్చాడు. కిందపడ్డాడు మధుసూదన్.

మరుసటిరోజు మధుసూదన్ చేతికి ప్యాక్ చేసిన చీర, రవి రిజిగ్నేషన్ లెటరూ అందాయి.

☆